# కనిపించని గాయాలు X

రచన :
శ్రీమతి పతానేని శ్రీశైల భ్రమరాంబ.

ఈ ప్రపంచంలో ప్రధానంగా మానవ జీవితానికి సుఖాన్ని, శాంతిని ఇచ్చేది, బ్రతుకునంతా సవ్యమైన బాటలో నడిపించి స్థిరపరిచేది, జీవితాంతం చేయూత నిచ్చేది దాంపత్య జీవితం-దంపతులు కాబోయేముందు ఒకరి నొకరు క్షణమాత్రకాలమైనా చూసుకోవడం సహజం. ఆ క్షణంలోనే వారిలో కొన్ని అమూల్య భావాలు ఉత్పన్నమౌతాయి. ఒక్కొక్క పరిస్థితిలో అల్లా దంపతులు కావాలని కోరుకొన్నవారుకూడా విడిపోవడం సంభవిస్తుంది. కోరుకొన్నది లభించక పోవడమంత బాధాకరమైనది లోకంలో ఇంకొకటి లేదు. స్త్రీకైనా, పురుషునకైనా తాము కోరుకొన్నవారు లభించకపోయేసరికి వారిబ్రతుకంతా నిరాశ! ఒకరి కోరిక ఇంకొకరికి ఎంతో అల్పమైనదిగా కన్పించవచ్చు. కానీ ఎవరికోరిక వారికి చాలా పెద్దదే! అది తీరాలని ఎంతో తపన! అది తీరకపోతే కారుచీకటిలాంటి నిరాశ! క్షణక్షణానికీ తీరనికోరిక 'కనిపించని గాయమై' హృదయాన్ని సలిపి, నలిపి, చీల్చుకుంటూవుంటుంది. తనకోరిక భగ్నం కావడంతో ఆవిషాదం ఆ మనిషిని వెక్కిరించి పీడించి, వేధిస్తూనే వుంటుంది. హృదయప్రాంగణంలో ఒకకోరిక మొలకెత్తేటప్పుడు 'ఇది తీరుతుందా?' అనే ఆలోచన రాదు. తీరకపోతేమాత్రం దీర్ఘ విచారం తప్పదు. అల్లాగని కోరికలు, ఆశలు జనించకుండా వుండవు. చైతన్యవంతమైన జీవికి కోరికలు ఊరకుండా ఎల్లా వుంటాయి? మానవుడు కోరికల్ని చంపుకోగలిగితే కందమూలఫలాలుతిని కాననాల్లోనే గడపగలిగేవాడు. సరిగ్గా వేణు హృదయంలో కూడా ఆశ, కోరిక అనేది ఉద్భవించింది. ఆ కోరిక దినదినాభివృద్ధిపొంది హృదయమంతా నిండిపోయింది.

* * *

వేణు, శ్రీహరి ప్రాణమిత్రులు. ఆ మిత్రులిద్దరూ ఒకరికోసం ఒకరు ప్రాణత్యాగం చెయ్యడానికైనా వెనుదీయని స్నేహితులు. ఒకకంచంలోతిని, ఒకమంచం మీదనిద్రించి, ఒకేబాటను నడుస్తూ, ఒకటోఫారంనుంచి బి. ఏ. పూర్తయ్యేవరకూ ఏకైకభావాలతో, రెండు తనువులుగల ఏకజీవిలా కల్సిమెల్సివుండేవారు. ప్రతి రోజూ సాయంత్రం శ్రీహరి, వేణు కల్సి షికారుకి వెడ్తూ బాతాఖానీ విడేసుకొనేవారు.

వేణు మామూలుగా శ్రీహరికోసం లోపలికి వెళ్ళబోతోంటే గుమ్మందగ్గరే ఒకయువతి ఆతని కళ్ళకు కన్పించింది. ఆమెను చూచిన వేణు ముందుకి అడుగు పడక తక్కున ఆగిపోయాడు. ఆమెకూడా వేణు కళ్ళల్లోకి చూస్తూ నిల్చుండి పోయింది. వేణు ఆజానుబాహు ఆరడుగుల పొడగరి, విశాలమైన ఛాతీ, నొక్కునొక్కుల క్రాపు, విశాలమైన ఫాలం, కొనదేలిన నాశిక, భూలోకంలో అవతరించిన ఏ గంధర్వుడో, మన్మధుడో అనుకొనేటంత అద్భుత సౌందర్యమూర్తి. ఆతని విశాల నేత్రాల్లోకి ఆమె కన్నార్పకుండా చూస్తోంటే...... వేణుకూడా ఆమెను కన్నార్పకుండా చూస్తున్నాడు. ఆంధ్రదేశంలో వేణు ఎందరో యువతుల్ని కళ్ళతో చూచాడే కాని ఇంతటి సౌందర్యరాశిని కలలో కూడా ఊహించుకోలేదనవచ్చు. మతిచెడినవానిలా ఆమెను నఖశిఖపర్యంతంచూస్తూ ఆమె రంభా, ఊర్వశి, ఒప్పులకుప్ప, వజ్రాలమొలక, మన్మథమొలక, అందాలభరిణ ఎవరా? అనుకొంటూంటే; .. 'ఎవరికోసం?' అనడిగింది ఆమె.

చందమామవంటి ఆ సుందరి వీణమీటినట్లు ప్రశ్నించేసరికి 'శ్రీహరి' అన్నాడు క్లుప్తంగా వేణు.

'మేడమీద గదిలో వున్నారు' అని చెబుతూ ప్రక్కగా తప్పుకొని దారి ఇచ్చింది.

వేణు మేడమెట్లెక్కి పైకి వెళ్ళాడు. శ్రీహరిని చూచి వేణు ఆశ్చర్యంగా నిల్చుండి పోయాడు. ఎప్పుడూ శ్రీహరి బట్టలు వేసుకోడానికి కూడా బద్ధంకిచేవాడు. ఈనాడు సిల్కు ప్యాంట్, బుష్‌కోటుతో టిప్‌టాప్‌గా వున్నాడు. సినిమాకి పోవాలన్నా కాని సబ్బుతో ముఖం తోమనివాడల్లా అరంగుళం దళసరి కోటింగులో టాయిలెట్ అయివున్నాడు. అడ్డెడు ఆముదం త్రాగినవాడిలా వుండే వానిముఖం కలకల్లాడ్తూ చిరునవ్వులు చిందిస్తూంటే; ఏమిటూ ఈ విడ్డూరం; అనుకొంటూ 'ప్రళయం పట్టదు కదా!, అన్నాడు వేణు.

ప్రళయం కాదురా బాబూ 'ప్రణయం' అన్నాడు నవ్వుతూ శ్రీహరి.

'నీలమేఘశ్యామా! అర్భకధామా!! నీరస, బధక ధామా!!! శ్రీహరినామా నీతో ప్రణయ సల్లాపాలు జరిపే మానిని ఎవరోయ్?...' అంటూ నాటకంలోని డైలాగులా ప్రారంభించాడు.

'ఒరేయ్ వేణూ! నా డ్రస్సు ఎల్లా వుందిరా?'

'ఆహా! దివ్యంగా వుంది. త్వరగా షికారుకి పోదాంరా!'

'ఇవ్వాళనుంచిఇంక మనకి సినిమాలు షికార్లకు కుదర వబ్బాయ్! మా మేనమామగారి ఏకైక కుమారీ రత్నంగారు మన యింటికి వేంచేశారు. ఆవిడగారికి మాతోటలు, పొలాలు, ఈ ఊరు అన్నీ చూపించిరమ్మని మదీయ జనని జనకులహుకుం. నేటినుండి నేనామెకి బాడీగార్డులా వుండాల్సిన గతిపట్టిందోయ్' అంటూ ఫోజులిస్తూ ప్రారంభించాడు శ్రీహరి.

అంతలో 'బావా... బావా...!! బావా!!' అంటూన్న కిన్నెర కంఠస్వరం విని వేణు అటు తిరిగి చూచాడు. ఎదురుగా ఆ యువతి కన్పించేసరికి ఏదో తప్పుచేసిన వాడిలా వేణు దూరంగా తొలగి నిల్చున్నాడు. శ్రీహరి మాత్రం నీటుగా అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకొంటున్నాడు.

'ఈమె మా మామయ్యకూతురు రమాదేవి. యస్సెల్సీ ప్యాసయింది... ఈతను నా ప్రియ మిత్రుడు వేణు' అని ఒకరినొకరికి పరిచయం చేశాడు శ్రీహరి.

రమాదేవి వేణుకి నమస్కరించడం, వేణు ప్రతి నమస్కారం చెయ్యడం పూర్తయ్యాక 'వెళ్ళొస్తా' అని వేణు వెళ్ళిపోబోయాడు.

'మనం ముగ్గురం కల్సి పిక్చరికి పోదాం! ఆగవోయ్' అన్నాడు శ్రీహరి.

'వేణూగారూ! సినిమాకి టైమ్ అయింది. బావ రెడీగా వున్నాడు. రండి పోదాం' అని పిలుస్తూన్న రమాదేవి కంఠస్వరం విని పుస్తక పఠంలో లీనమై పోయిన వేణు తలఎత్తాడు-అప్పటికే ఆమె తనకి దగ్గరగా వచ్చి నిల్చుంది. ఆమెకి కొంచెం దూరంలో శ్రీహరి నిల్చున్నాడు.

రమాదేవి తెల్లని చీరకట్టి, నీలం జాకెట్టు తొడిగి, జడనిండా మల్లెలు, జాజులు తురుముకొని, కళ్ళకు కాటుక, నుదుట తిలకం, కాళ్ళకు నల్లని ముఖమల్ స్లిప్పర్సు వేసుకొని ఎంతో అందంగా చూడ ముచ్చటగా వుంది. చేతిని ఉన్న బంగారు గాజులకంటే ఆమె శరీరమే హెచ్చు కాంతిలో ఉన్నట్లుంది. ఆమె అందానికి ఆ అలంకరణ పూలకి తావి అచ్చినట్లు, వజ్రాన్ని వరపెట్టినట్లు, అర్ధచంద్రుడు పూర్ణశశాంకుడై నట్లు ఎంతో మెరిసి పోతోన్న ఆమె ముఖంమీదనుంచి చూపులు మరల్చుకోలేకపోతున్నాడు వేణు. వేణుని చూసి సిగ్గుతో తల దించేసుకొంటోంది రమ.

'వేణూ! నువ్వు రమ ఒకే రూపంతో, ఒకేఅందంలో ఒక పల్లి పిల్లల్లా ఉన్నారోయ్' అన్నాడు శ్రీహరి.

అందాలుచిందే వేణు ముఖంలో తనకు ఏదో లభ్యమౌతుందన్నంత సంబరంతో కంటిమీద రెప్ప వాల్చకుండా చూస్తోంది రమాదేవి. వికసితవదనారవింద యైన రమ చూపుల్లోని భావాల్ని అర్థం చేసుకోలేక అవస్థపడ్డాడు వేణు. ముగ్గురూ సినిమాకి బయలుదేరి వెళ్లారు.

రమ మేనత్తగారింటికి వచ్చి నెలరోజులయింది. ఈ నెల్లాళ్ళనుంచి శ్రీ హరితోకంటే వేణుతోనే ఎక్కువ చనువుగా కలుపుగోరుతనంతో వుంటోంది. అందుకు శ్రీహరి కూడా చాలా ఆనందిస్తున్నాడు - ఏ మాత్రం అవకాశం చిక్కినా రమ వేణు వైపు తదేకంగా చూస్తూండేది. ఆమె చూపుల ధాటికి తట్టుకోలేక తల వొంచుకునేవాడు వేణు. అతని పరిస్థితిని గమనించిన రమ గమ్మత్తుగ నవ్వేది. ఆమె నవ్వుల వాలాకాన్ని చూచిన వేణు హృదయంలో ఏవో ఆశలు మోసులై చిగురించేవి. పరవశ్యంతో వేణు మాట్లాడుతోంటే రమ చిలిపి కళ్ళతో చూస్తూ ఎంతో ఆశక్తిగా వినేది. క్యారంస్, చదరంగం ఆడేటప్పుడు రమ అప్రయత్నంగా వేణు చేతినిస్పృశిస్తూండేది.

ముగ్గురూ కల్సి షికార్లకి, సినిమాలకీ, ఆటలకీ...... అన్నింటా కల్సి మెల్సి ఒకటిగానే రోజులు క్షణాల్లా దొర్లిస్తున్నారు.

ఆ రోజున ముగ్గురూ కల్సి బీచికి వచ్చారు. సాయంత్ర సంధ్యాకాంతులు నీటిమీద పడి మిలమిలా మెరుస్తోంటే చిరు నవ్వులు చిందించే రమ ముఖం పూర్ణ చంద్రునిలా

వికసించి, ఆనీ రెండలు ఆమె బుగ్గల్లోకూడా ప్రతిఫలిస్తున్నాయ్. తెల్లటి వాయిల్ చీర, ఎర్రని క్రేప్ సిల్కు జాకెట్టు, తలలో వికశించిన మల్లెలు గుబాళిస్తోంటే; గాలి తెరలు తెరలుగా వచ్చి ఆమె అవయాలతో దోబూచులాడుతోంది. ఆమె నయనాల్లోని చూపులన్నీ వేణుమీదే కేంద్రీకరించి వున్నాయ్. వేణు ఆమెకి ఎదురుగా కూర్చున్నాడు,

'బావా! ఫస్టు షో లైలామజ్నూ సినిమాకి పోదామా? ......అయినా ఇంటికి వెళ్ళందే డబ్బు ఎల్లా?' అంది రమ.

'ఇప్పుడు మాత్రం మించిపోయిందేముంది? ఇక్కడ హాల్లోనేకదా ఆ పిక్చర్. ఇంకా అరగంట టైమ్ వుంది. మీరిద్దరూ ఇక్కడే ఉండండి- నేను యింటికి వెళ్ళి డబ్బు తీసుకొస్తా' అంటూ శ్రీహరి ఆమె జవాబుకైనా ఎదురు చూడకుండా గబగబా వెళ్ళిపోయాడు.

ఏకాంతంగా వేణు రమ మిగిలారు. నఖశిఖపర్యంతం అతని అందాన్ని ఆస్వాదిస్తూన్నట్లు అతని కళ్ళల్లోకి చూచి చిరునవ్వు నవ్వింది రమ. వేణుకి దగ్గరగా వచ్చి శరీరాలు తగిలేటట్లుగా కూర్చుంది రమ. వేణు ఏదో తప్పు చేస్తూన్నట్లుగా బాధపడ్తూ కొంచెం దూరంగా జరిగాడు.

'అదేమిటి వేణూగారూ! నేనేమైనా అంటరాని దాన్ననా దూరంగా జరిగి కూర్చున్నారు? మీ కంతభయమైతే నా గాలియైనా తగలరాదని చెప్పెయ్యండి' అంది పరిహాసంగా.

'అబ్బే! ఏమీ లేదు' అన్నాడు.

'వేణూ! మీరు మాట్లాడుతోంటే ఎంతో మృదుమధురంగా వుంటుంది. మీ ముఖం చూస్తోంటే నా హృదయంలో ఆనందం చిందులుత్రొక్కి నన్ను నేనే మర్చిపోతూంటాను.'

'రమా! మీకంటే చమత్కారంగా నేను మాట్లాడగలనా? ఎదుటి మనిషిని నిలబెట్టగలిగే అందం మీది' అన్నాడు వేణు. అతని కంఠంలో ఆశ ఉట్టిపడింది.

'వేణూ! లోకంలోవుండే అందమంతా నీలోనేపెట్టి సృష్టించాడు ఆ విధాత. నిన్ను చూస్తూ కాలమంతా హాయిగా, తియ్యగా గడపగలను' అంటూ రమ అతని భుజంమీద చెయ్యి వేసింది.

'రమా! ఆలోచించకుండా దేనికీ తొందరపడడం శ్రేయస్కరం కాదు.'

'వేణూ! ఏమిటీ వేదాంత ధోరణి?' అంటూ అర్ధనిమీలిత నేత్రాలతో ఏ సుఖస్వప్న లోకాల్లోనో విహరిస్తూ అంది.

'రమా! ఏమిటీ సాహసం?' అని కొంచెం గట్టిగానే అన్నాడు వేణు.

'వేణూ! నిన్ను హృదయపూర్వకంగా ప్రేమించి మనసారా కోరుకొంటున్నా. నామీద నీకు ప్రేమలేదా?' అని ఆతృతగా చూస్తూ సూటీగా అడిగింది.

కొన్ని క్షణాలు నిర్వచింపలేని మానశికావస్థతో నిశ్చలంగా ఆమెవైపు చూచాడు వేణు.

'ఏం వేణూ! నేనంటే నీకిష్టంలేదా?!! నా హృదయాన్ని నువ్వర్ధంచేసుకోలేవా?!!!' ఆవేదనతో అడిగింది.

'రమా! నిన్ను మనసారా కాంక్షించి పూజిస్తున్నాను-కాని...'

'ఏం? నన్ను జీవితాంతం స్వీకరించడానికి నీకిష్టం లేదా?'

'నువ్వు నీబావకి......రమా! నేను నా మిత్రునికి ద్రోహం చెయ్యలేను'

'వేణూ! నువ్వు పొరబడుతున్నావు-నీమిత్రుడు నన్ను ప్రేమించడంలేదు. అతడే నాకు భర్తఅని నువ్వెల్లా అనుకోగలిగావ్?......'

కొన్నాళ్లపాటు మీ యిద్దరూ కలిసిమెలిసివున్నాక పెళ్లిచెయ్యాలని ఉద్దేశంచేత నేకదా నిన్నిక్కడికి మీ వాళ్లు పంపించారు-పెద్దలమాటలుకాదని.........'

'వేణూ! మా బావ నాకు మగనిగామాత్రం తగడు. నల్లగా సన్నంగా......నాకాతనిని వివాహమాడ్డం సుతరామూ ఇష్టంలేదు-మా పెళ్ళి ఈజన్మలో జరగదు. నీకోసమే నేనింతకాలం ఇక్కడ వుంటున్నా.'

'రమా! నేను చాలా బీదవాణ్ణి. నా మిత్రుని దయవల్లనే ఇంతవాడినయ్యాను-శ్రీహరికి నామీద ప్రేమ...'

'వేణూ! మగవాని హృదయాన్ని మగువ అర్ధంచేసుకున్నంత సునాయాసంగా మగువ మనస్సును మగాడు అర్ధంచేసుకోలేడు. బావ మనస్సును నేనన్నివిధాలా

(తరువాయి 19వ పేజీలో)

(10వ పేజీ తరువాయి)

గుర్తించాను. ఆతనికి నామీద అణుమాత్రమైనా ప్రేమ లేదు-వేణూ! మగవాడెప్పుడూ ఎక్కువ ఆనందసమయంలో తన అంతరంగంలోని ఆశను, ఆశయాల్ని స్పష్టంగా ముఖంలో ప్రతిఫలింపజేస్తూ మాట్లాడ్తాడు. ఆడువారి విషయంలో సుఖం, దుఃఖం ఒకేవిధంగా భావించి హృదయంలో దాచుకొంటుంది. ముఖంలో కన్పించే భావానికి, మనస్సులోవుండే విషయానికీ సంబంధం వుండదు-...నీవిషయంలోమాత్రం నేను నిన్ను గాఢంగా ప్రేమిస్తున్నా.'

రమా! నీయందు ప్రేమలేకపోతే శ్రీహరి నీకోసం ఇంత...'

'వేణూ!నీకింకా నా మాటలమీద నమ్మకంలేదా? ఒక్క విషయాన్ని మాత్రం తెల్సుకో. స్త్రీ పురుషులు హఠాత్తుగా తారసిల్లినప్పుడు మొదటి సందర్శనలో నే తత్తరపాటో; తన్మయత్వమో కలుగుతుంది. ప్రేమికులకు —ఆ రెండు భావాలులేక నిశ్చలంగా వున్నవారైతే ప్రేమికులుకారు స్నేహితులు. అందుకే నీ మిత్రుడు నాకూ మిత్రుడే!'

'రమా! అయితే మన ఆశలు ఫలిస్తాయా?' పరిపూర్ణమైన ప్రేమతో అడిగాడు వేణు.

'వేణూ! ఏ పవిత్ర క్షణంలోని నిన్ను చూచానో; ఆనాడే నా హృదయం నీకు అంకితం చేసాను' అంది తన్మయత్వంతో.

'రమా! నా హృదయాది దేవతం నువ్వే!' అంటూ ప్రేమగా ఆమె చేతులను తన చేతుల్లోకి లాక్కొన్నాడు.

అంతలో శ్రీహరి హడావిడిగా అక్కడికి వచ్చి 'రా! రా!! పోదాం!!! సినిమాకి టైమ్ అయిపోయింది' అంటూ వేణుచెయ్యి పట్టుకు లాక్కువెళ్ళడంతో వారి వెనకాలే నడిచింది రమ.

రాత్రి సినిమా నుంచి ఇంటికి చేరుకోగానే శ్రీహరి డ్రస్ మార్చుకోడానికి మేడమీదికి వెళ్ళిపోయాడు. రమ వేణు వెనకాలే ఆతని ననుసరించింది. 'వేణూ!' అన్న పిలుపుతో వెనుతిరిగి చూచాడు. వారిద్దరి హృదయాలు ఏ మధుర క్షణంకోసం ఎదురు చూస్తున్నాయో కాని వారి అధరాలు అదిరి, ఉవ్వెత్తునా ప్రేమ పొంగుకొచ్చి ఒడ్డున తాకే సముద్రపు కెరటాల్లాగ ఒకరినొకరు గట్టిగా అదిమి పట్టుకున్నారు.

మేడమీది నుంచి 'వేణూ! వేణూ!' అన్న శ్రీహరి పిలుపుతో ఇద్దరూ విడిపోయారు.

రెండు నెలలు ఏక దీక్షగా వేణూ రమా ప్రేమ సయ్యాటలూ, దాగుడు మూతలతో...వారి ప్రేమలత పెద్దదై ఫలించి పుష్పించింది. ఇంక వివాహం కోసమే ఆ ప్రేమ జంట ఎదురుచూస్తూ ఉవ్విళ్ళూరుతున్నారు.

ఆరోజు ప్రొద్దుట నుంచీ వేణు కంటికి రమ కన్పించలేదు. ఇంటినిండా బంధువులు వచ్చారు. శ్రీహరి కూడా వారితో కల్సిమెల్సి ఉండడంచేత వేణుతో మాట్లాడేందుకు కూడా అవకాశంలేకుండా పోయింది. సరిగ్గా సాయంత్రం శ్రీహరి వేణు దగ్గరికివచ్చి హడావిడిగా చెయ్యిపట్టుకు లాక్కుపోతూ 'త్వరగారా! టైమ్ అయిపోతోంది' అన్నాడు ఆత్రంగా.

'ఏమిట్రా నీహడావుడి' అంటూ నవ్వుతూ అడిగాడు వేణు.

'మన కోరిక తీరడానికి ఇంకెంతోవ్యవధి లేదురా. అంతా రెడీ'

'ఏమిటో చెప్పకుండానే నీలో నువ్వు తన్మయుడవై పోతున్నావేమిటోయ్? నీ ఆనందమేదో కొంచెం నీ మిత్రుణ్ని నన్నుకూడా పంచుకోనియ్యి' అన్నాడు పకపకా నవ్వుతూ వేణు.

'నాకు (మా) రమకు పెళ్ళిరా. అతి నిరాడంబరంగా జరగాలని నేను చెప్పడంచేత మా వాళ్ళు అట్టే ఆట్టహాసాలు చెయ్యలేదు. ఇంకొక్క గంటలో ముహూర్తం.'

వేణు ముఖంలో ఆనందం నిష్క్రమించి ఆవేదన ఆవహించింది. 'రమకి నువ్వంటే...'

'ప్రేమ వుందా? అనా నీ సందేహం? రమకి నామీద ప్రేమ, ఇష్టం వుండబట్టే ఈ నాల్గునెలలనుంచీ ఇక్కడే వుంది. నేనూ రమను ప్రేమించాను. వేణూ! రమకు నామీదే పరిపూర్ణమైన ప్రేమ వుందనుకోడానికి నిదర్శనం మనిద్దరితోనూ తప్ప మూడో వ్యక్తితో ఆమె ఒక్కనాడైనా మాట్లాడిందా? చెప్పు? నువ్వు నాకు నమ్మిన మిత్రుడవు. ఈరోజునుంచీ రమ నాభార్య అయినా ఇది వరకులాగే నువ్వు మాయిద్దరికీ మిత్రుడవే. నీయందు నాకు పూర్తి నమ్మకం వుంది కాబట్టే రమను నీదగ్గర స్వేచ్ఛగా మెలగనిచ్చాను. వేణూ మా పెళ్ళి నీకు

(తరువాయి 26వ పేజీలో)

# గాలిని తూచే త్రాసు

జూన్ నెల తొమ్మిదోవ తారీఖునుంచి 17 వ తారీఖు వరకూ, జర్మనీలో మెయిన్ నదిమీదున్న ఫ్రాంక్ ఫర్ట్ నగరంలో 'అకేమా' 1961 అను పేరట రసాయనక పారిశ్రామిక ప్రదర్శనం ఒకటి జరిగింది. దీనిలో అతి ఆధునికమైన నూటఆరుటన్నుల 'హైప్రెషర్' అను విచ్ఛిన్న యంత్రం నుంచి, గ్రామ్‌లో పదిలక్షోవంతు బరువుగల గాలిని సహితం తూచగల త్రాసులవరకూ అనేకరకాల ఆధునిక పారిశ్రామిక పరికరాలిందులో ప్రదర్శించారు,

దీనిలో 50 దేశాలకి చెందిన ప్రముఖులైన ఇంజనీర్లు, భౌతిక శాస్త్రవేత్తలు, రసాయనక శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, పారిశ్రామిక వేత్తలు. తదితరులు ఎందరో పాల్గొన్నారు. ఈ ప్రదర్శన సందర్భంలో వైజ్ఞానిక సమస్యలగురించీ, ముఖ్యంగా రసాయనక, ఇంజనీరింగు సమస్యలగురించీ, విద్వగోష్టి జరిగింది. ఈ సమావేశాలు, ప్రదర్శనం చూడడం కోసం, జర్మనీలో వివిధ ప్రాంతాల నుంచీ విదేశాల నుంచీ లక్షమంది ఫ్రాంక్ ఫర్డ్ సందర్శించారు, యూరప్ ఆశియా లాటిన్ అమెరికా దేశాలలో పదహారు దేశాల పారిశ్రామిక సంస్థ లీ దేశంలో పాల్గొన్నాయి.

ఒకరి అనుభవాలు ఒకరు తెల్సుకోడానికి వీలు కల్గ చేయడం కోసం ఈ ప్రదర్శనాన్ని ఏర్పాటుచేసిన జర్మన్ రసాయనక ఇంజనీరింగు, ఇంజనీరింగు పరికరాల సంఘంవారు మన దేశంనుంచీ, టర్కీ అరబ్బు దేశాల నుంచీ, నిపుణులైన శాస్త్రజ్ఞులనీ సమావేశాలకి హాజరవడం కోసం ఆహ్వానించి, కావల్సిన సదుపాయాలు చేశారు. దీనివల్ల ప్రపంచంలో అనేకమంది అనుభవాలు కూడపోసుకోడానికి వీలయింది. అనేకదేశాల నుంచి విద్యార్థులు కూడా పాల్గొనడానికి తగు సౌకర్యాలు చేశారు.

పారిశ్రామిక ఫాయాలో రసాయనక ఉత్పత్తి బాగా జరగాలంటే, వాటిలో ఉపయోగించే పరికరాలు పదతులు మేలురకమయినవిగా ఉండాలనీ అతి నిశితమైన సున్నితమైన పరికరాలు, డిజైన్లు, ఉండాలనీ, శక్తి ఉండాలనీ, శక్తి సామర్థ్యాలుగల వ్యక్తులుండాలనీ, అందరికీ తెల్సినదే. ఆదినుంచి అణువిచ్ఛిన్నం వరకూ రసాయన పరిశ్రమలు సాధించినదంతా యీ ప్రదర్శనంలో చూడవచ్చు. అనేక పరిశ్రమలలో ఉపయోగిస్తున్న అతి సున్నితమైన యీ పరికరాలు లక్షలాది మంది నాకరిఁంచాయి. గ్రామ్‌లో పదిలక్షోవంతు తూచగల ఆ త్రాసు ప్రేక్షకుల ఉచ్ఛ్వాస నిశ్వాసాలవల్ల కంపనం పొందకుండా దానిని మూడుపొరల గ్లాసు కేసులో ఎంతో జాగ్రత్తగా అమర్చారు.

'ఇన్ ట్రా'

(19 పేజీ తరువాయి)

సంతోషం కదూ?' అన్నాడు ఉప్పొంగిపోతూ శ్రీహరి.

'నీకు ద్రోహం చెయ్యను' అని మనస్సులో అనుకొంటూ 'ముందు నువ్వు నడు' అన్నాడు వేణు.

వేణు దూరంనుంచి చూస్తున్నాడు. తనమిత్రుడు శ్రీహరి తనప్రేయసి రమమెడలో మంగళ సూత్రం కడుతున్నాడు. ఇది తనకి భరింపలానివిషాదం! రమ చర్యలు, ఆమె మూర్తి ఆతని హృదయంలో చెరగని ముద్రల్లా అతుక్కుపోయాయి. ఇది తనకి జీవితాంతం కనిపించని గాయమై బాధిస్తూనే వుంటుంది. అయినా తనమిత్రుడు భార్యతో ప్రశాంతంగా ఆనందజీవితాన్ని గడపాలంటే తను దూరంగా పోవాలి. ఇంక తనముఖం వారికీ కన్పించనియ్యకూడదు–అనుకొంటూ వేణు గిరుక తిరిగి వెళ్ళిపోయాడు. రైలుస్టేషన్ కి–

రమా శ్రీహరి పెళ్ళిపీటలమీదనుంచి లేచేసరికి వేణు ఎక్కిన ట్రయిను కదిలింది.




Edited and Published by A, N, Raghavachar, No, 32, Krishnappa Naick TankSt,, Madras-1
Printed by V, Kuppuswamy Chetty, Bharathmata Press, No, 39, Anderson St,, Madras-I